ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 41.0 కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 3 మే 2025

నవశకానికి నాంది..!

అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన



అమరావతిలో మాజీ మంత్రి పల్లె, ఎంపీలు అంబికా, పార్థ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పరిటాల సునీత, బండారు శ్రావణి, పల్లె సింధూర, ఎంఎస్ రాజు



జాతీయ రహదారి 44లో ఎర్రమంచి, గుడిపల్లి వద్ద నిర్మించే ఆర్ఓబీ నమూనా

- నాలుగు లేన్లుగా గోరంట్ల- హిందూపురం రోడ్డు విస్తరణ
- 43.58 కి.మీ.కు రూ.809 కోట్లు కేటాయింపు
- రూ. 124 కోట్లతో కియ, గుడిపల్లి వద్ద ఆర్ఓబీ
- గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం

పుట్టపర్తి/గుంతకల్లు మే2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గోరంట్ల- హిందూపురం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. ఈక్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబుతో కలిసి అమరావతి నుంచి వర్చువల్‌గా రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 43.58 కిలోమీటర్లు రోడ్డు విస్తరణ పనులను రూ.809 కోట్లతో చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలో జాతీయ రహదారి 716జీని కడప జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం దాకా నాలుగు వరుసలుగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. మొదటి ప్యాకేజీ కింద కడప జిల్లా ముద్దనూరు నుంచి తలుపుల మండలం బీకొత్తపల్లి వరకు రూ.1020 కోట్లతో పనులు చేపట్టనున్నారు. బీకొత్తపల్లి నుంచి కదిరి మీదుగా గోరంట్ల దాకా రెండో ప్యాకేజీ కింద పనులు తుదిదశకు వచ్చాయి. తాజాగా గోరంట్ల- హిందూపురం (మిగతా 6లో..)

రీసర్వే కష్టాలు..!



- పంట రుణాల రెన్యువల్‌కు ఇబ్బందులు
- బ్యాంకు సర్వర్‌లో కనిపించని భూమి వివరాలు
- వన్‌బీలో వీఆర్వో సంతకం కావాలంటున్న బ్యాంకర్లు
- అన్నదాతలకు తిప్పలు
- గడువు దాటితే ప్రయోజనాలకు దూరమయ్యే ప్రమాదం



రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో చేపట్టిన భూముల రీసర్వే అన్నదాతలకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. రీసర్వే చేసిన గ్రామాల పరిధిలోని కొందరు రైతుల భూములు ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోయాయి. పంట రుణాల రెన్యువల్‌కు బ్యాంకుకెళ్లిన రైతులకు అక్కడ సర్వర్‌లో తమ భూమి వివరాలు చేవని చెబుతుండడంతో అవాక్కవుతున్నారు. వారి వద్ద వన్‌బీ ఉన్నా.. నిష్ప్రయోజనమే. అందులో సంబంధిత వీఆర్వో సంతకం చేయించుకు రావాలని బ్యాంకర్లు.. రైతులను వెనక్కి పంపుతున్నారు. దీంతో రైతులు వీఆర్వో చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. వీఆర్వో అందుబాటులోకి రాక.. పంట రుణాల రెన్యువల్ చేసుకోకపోతే.. ప్రభుత్వ పథకాలన్నింటికీ దూరమవ్వాల్సిందే.

బ్యాంకు సర్వర్‌లో కనిపించని వివరాలు..

మండలంలోని రాప్తాడు, హంపాపురం, గొంది రెడ్డిపల్లి, బండమీదపల్లి, గాండ్లపర్తి గ్రామాల్లో రెండు బ్యాంకులు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు దాదాపు 15 వేల మంది పంట రుణాలు తీసుకున్నారు. గత నెలాఖరులో రుణాల రెన్యువల్ ప్రారంభించారు. రెన్యువల్ చేయాలంటే రైతులు తప్పనిసరిగా మీసేవ కేంద్రాల్లో భూమి వివరాలు తెలిపే వన్‌బీ పత్రం, బ్యాంకు అకౌంట్, ఆధార్, పట్టాదారుపాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకెళ్లాలి. అధికారులు బ్యాంకు వెబ్‌సైట్‌లో రైతుల భూమి వివరాలు పరిశీలిస్తారు. భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటే వెంటనే రెన్యువల్ ప్రక్రియ పూర్తవుతుంది. బ్యాంకు సర్వర్‌లో రైతు భూమి వివరాలు చూపకపోతే రెన్యూవల్ చేసేందుకు వీలుకాదు. ఆ రైతు మీసేవ కేంద్రంలో వన్‌బీ పత్రం తీసుకుని వీఆర్వోతో సంతకం చేయించుకెళ్తేనే రెన్యువల్ చేస్తున్నారు. విషయం తెలియక అనేక మంది రైతులు చివరి తేదీన రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు బ్యాంకులకు వెళ్తున్నారు. బ్యాంకు సర్వర్‌లో రైతుల భూమి వివరాలు చూపలేదని అధికారులు చెబుతుండడంతో షాక్‌కు లోనవుతున్నారు. వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఆ సమయంలో వీఆర్వో అందుబాటులో లేకపోతే అంతే సంగతులు. గడువులోగా రెన్యువల్ చేసుకోకపోతే పావలా వడ్డీ ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవు.

రీసర్వే గ్రామాల్లోనే ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని బొమ్మేపర్తి, బుక్కచెర్ల, గాండ్లపర్తి, గంగలకుంట గ్రామాల పరిధిలో భూముల రీసర్వే చేపట్టారు. ఫలితంగా రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకే సర్వే నంబరులోని రైతులను జాయింట్‌గా చూపుతుండడంతో మీసేవ కేంద్రాల్లో వన్‌బీ పత్రాలు రావడం లేదు. వారు కూడా వీఆర్వో సంతకంతో రుణాలు రెన్యూవల్ చేసుకుంటున్నారు.

సమస్య పరిష్కరించాలి

కొంతమంది రైతులు తమ భూమి వివరాలు బ్యాంకులోని సర్వర్‌లో చూపకపోవడంతో సకాలంలో రెన్యువల్ చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-ముత్యాలప్ప, రైతు, బోగినేపల్లి

రాష్ట్రవ్యాప్తంగా సమస్య

రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

నేరం.. బేరం..!



● నెలవారీ మామూళ్లు.. సెటిల్‌మెంట్లు.. ● సంపాదనలో కొందరు పోలీసులు బిజీ

- కళ్లెదుటే మట్కా రాస్తున్నా పట్టించుకోరు
- అక్రమ రవాణాలో పట్టుబడినా వదిలేస్తారు
- కేసులు కట్టరు.. కట్టినా ఛేదించరు
- జిల్లాలో గాడితప్పిన పోలీసు వ్యవస్థ

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు జిల్లా అడ్డాగా మారింది. దొంగతనాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, వ్యభిచారం, సైబర్ నేరాలు, మట్కా, పేకాట, అక్రమ మద్యం, అశ్లీల చిత్రాల దందా.. ఇలా ఎన్ని నేరాలు జరుగుతున్నా పోలీసు శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎవరి సర్కిల్ పరిధిలో వారు సెటిల్‌మెంట్లు, మామూళ్ల మత్తులో గడుపుతున్నారు. ఇలాంటి వారికి అధికార పార్టీ నేతల దన్ను ఉండటంతో జిల్లా ఉన్నతాధికారులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే అదనుగా కొన్ని పోలీస్ స్టేషన్‌లలో కొందరు ఎస్‌ఐలు, సీఐలు సంపాదనలో పడ్డారని సమాచారం. మద్యం దుకాణాలు, బియ్యం అక్రమ రవాణాదారులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఇచ్చే నెల మామూళ్లపైనే దృష్టి సారిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎక్కడ ఏం జరిగినా కిందిస్థాయి సిబ్బందిపై మాత్రమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కాల్‌సెంటర్‌లో పోర్న్ దందా



గుంతకల్లులో ఈ సెంటర్‌లో పోర్న్ వీడియోలు తీసింది

● గుంతకల్లు పట్టణంలోని బెంచి కొట్టాలలో 'మారియా ఇన్ఫోటెక్' పేరుతో కాల్ సెంటర్ నిర్వహించేవారు. ఈ ముసుగులో పోర్న్ వీడియోలు తీసి, ప్రైవేట్ వెబ్‌సైట్‌లకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. కాల్ సెంటర్‌కు వచ్చే యువతులను ప్రలోభ పెట్టి ఈ దందాలోకి లాగినట్లు పోలీసులు గుర్తించారు. రెండు వారాల క్రితం విజయవాడ ఈగల్ టీం దాడి చేసి, ఇక్కడి కాల్ సెంటర్ నిర్వాహకుడు లూయిస్‌తో పాటు ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసింది. అప్పటి వరకూ ఇక్కడ ఈ దందా జరుగుతున్నట్లు స్థానిక పోలీసులకు తెలియనే లేదట. కానీ మామూళ్ల మత్తే వారిని ఆ వైపు వెళ్లనివ్వలేదని పట్టణవాసులు అంటున్నారు.

● గుంతకల్లు పట్టణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తోంది. గంజాయి అమ్మకాలు, వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. రైల్వే జంక్షన్ కావడంతో కొత్త ప్రాంతాలవారి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. నేరగాళ్ల సంచారానికి అడ్డు లేకుండా పోయిందని అంటున్నారు. గుంతకల్లు, గుత్తి ఆర్‌ఎస్‌లో గంజాయి వినియోగం పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలే ఆదాయ వనరులు



● కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కొందరు పోలీసులు ప్రతి క్షణం పైసా వసూల్ గురించే ఆలోచిస్తుంటారని అంటున్నారు. ఇక్కడి ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిబ్రవరిలో కేసుల్లేని ఎనిమిది బైక్‌లను విక్రయించారు. అందులో ఐదు బైక్‌లను మెకానిక్ షాపు వారికి, మూడు బైక్‌లు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మినట్లు సమాచారం. ఓ అధికారి కనుసన్నల్లో ఓ కానిస్టేబుల్ ఈ వ్యవహారం నడిపించారని తెలిసింది. ఇంటి దొంగలు కావడంతో అంతా గుట్టుగా ఉంచారని సమాచారం.

● మూడు నెలల క్రితం ఓ మహిళ బియ్యం మధ్యలో కర్ణాటక మద్యాన్ని తీసుకువస్తూ పట్టుబడింది. ఆమె ఓ అధికారికి రూ.50 వేలు, కానిస్టేబుల్‌కు రూ.10 వేలు ఇచ్చి కేసు లేకుండా చేసుకుందని సమాచారం. ఈ ప్రాంతంలో రద్దీగా ఉన్న టీ సర్కిల్‌లో రెగ్యులర్‌గా వాహనాలను తనిఖీ చేస్తుంటారు. కానీ అక్కడే, బహిరంగంగా మట్కా రాస్తున్నా పట్టించుకోవడం లేదు.

● ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఓ మహిళ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మట్కా రాస్తుంటారు. ఈ పట్టణ పరిధిలోనూ, సమీప గ్రామాల్లోనూ పదుల సంఖ్యలో మట్కా సెంటర్లు నడుస్తున్నాయని సమాచారం. వీరందరి నుంచి నెలవారీ మామూళ్లు అందుతాయని, అందుకే చర్యలు ఉండవని అంటున్నారు. రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఓ పది మంది పేకాట నిర్వాహకుల నుంచి మామూలుగా మామూళ్లు అందుతుంటాయని అంటున్నారు.

● ఇక్కడ ఓ కానిస్టేబుల్ బాగా ముదిరిపోయాడని సమాచారం. రైస్ పుల్లింగ్ పేరుతో ఓ పురాతన వస్తువు తన వద్ద ఉందని చెప్పి.. అనంతపురానికి చెందిన వ్యక్తిని నమ్మించాడు. దాన్ని ఇచ్చేందుకు రూ.12 లక్షలు ఆ వ్యక్తి నుంచి అడ్వాన్సుగా తీసుకున్నట్లు సమాచారం. కానీ ఆ తరువాత ఫోన్ చేస్తే స్పందించడం లేదంటున్నారు. అతని మాయలో పడి మోసపోయిన వ్యక్తి.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి వెళుతుంటే.. మరొకరు అడ్డుపడి మధ్యవర్తిత్వం చేస్తున్నట్లు తెలిసింది.

రింగ్ మాస్టర్

● ఉరవకొండ పరిధిలో ఓ కానిస్టేబుల్ రింగ్‌మాస్టర్ అవతారమెత్తాడు. లెక్కల విషయాల్లో ఇతనే కీలకంగా ఉంటాడు. దీర్ఘకాలంగా పనిచేస్తుండటంతో లెక్కలేనన్ని ఆరోపణలున్నాయి. ఇటీవల వీఆర్‌కు పంపాలని చూశారు. ఆ పోలీస్‌స్టేషన్ నుంచి కదల్చలేకపోయారు.



● ఈ నియోజకవర్గంలో ఓ వైసీపీ నాయకుడు రేషన్ బియ్యం వ్యాపారంలో బాగా ముదిరిపోయాడు. ఇతన్నుంచి పోలీసులకు మామూళ్లు వెళ్తుంటాయి. ఐదురోజుల క్రితం ఉరవకొండ మండల పరిధిలోని ఓ గ్రామంలో గొర్రెల దొంగతనం కేసులో అనుమానితులను పట్టుకున్నారు. ఆ తరువాత సంబంధం లేదని వదిలేశారు. వారి నుంచి రూ.40 వేలు వసూలు చేసినట్లు సమాచారం.

● ఉరవకొండ రూరల్ సర్కిల్‌లోని ఓ స్టేషన్‌లో అధికారి అన్నీ ప్రైవేట్ డ్రైవర్ ద్వారానే నడిపిస్తున్నారు. అతనే లావాదేవీలన్నీ జరుపుతుంటాడు. సమీపంలోని మరో ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ, ఓ కానిస్టేబుల్ అన్ని వ్యవహారాలు చక్కబెడుతుంటారని సమాచారం.

ఎవరి దందా వారిది..



రాయదుర్గం పరిధిలో ఓ సీఐ పంచాయితీలు, సెటిల్మెంట్లలో బిజీగా ఉంటారని, బాగా వెనకేస్తుంటారని పేరు పొందారు. ఇదే నియోజకవర్గంలో ఓ సీఐ వైసీపీ హయాంలో అక్రమ మద్యం వ్యవహారాలలో పెద్ద మొత్తంలో సంపాదించారు. ప్రభుత్వం మారినా, ఆయన ఇంకా అక్కడే చక్రం తిప్పుతున్నారు. బొమ్మనహాళ్ మండలాల్లో బియ్యం దందా జోరుగా నడుస్తోంది. పోలీసులకు నెలవారీ ముడుపులు వెళుతుండటంతో పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. శింగనమలలో పేకాట, ఇసుక దందా భారీగా నడుస్తోంది. అక్కడున్న కీలక అధికారి తనను ఎవరూ ఏమీ చేయరనే ధీమాలో ఉన్నారు.

కేసులు వద్దమ్మా....

● గుత్తి మున్సిపాలిటీలో దొంగతనాలకు లెక్కేలేదు. వరుస దొంగతనాలు జరిగినా పోలీసులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఏటీఎం కేంద్రాల్లో అమాయకులను బురిడీ కొట్టించి డబ్బులు కాజేసిన వ్యవహారాలు జాతరను తలపించాయి. నకిలీ ఏటీఎం కార్డులతో ఏటీఎం సెంటర్ల వద్ద తిష్ట వేసి, డబ్బులు డ్రా చేయడం రానివారిని టార్గెట్ చేశారు. నకిలీ కార్డులు చేతిలోపెట్టి, ఆ తరువాత అసలు కార్డుతో డబ్బులు డ్రా చేశారు. ఈ కేసులను ఛేదించే ఆలోచన చేయడం లేదు. కొన్ని నేరాలకు సంబంధించి కేసులు కూడా కట్టరనే విమర్శలు ఉన్నాయి. పట్టణ ప్రజలను కదిలిస్తే, 'ఇక్కడి పోలీసు అధికారులకు పైసా వసూళ్లపై ఉన్న ఆసక్తి కేసుల ఛేదింపుపై ఉండటం లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నెలరోజుల క్రితం గుత్తి మండల పరిధిలోని ఓ గ్రామ సమీపంలో ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందాడు. ఈ కేసులో బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు, సెటిల్ చేసిన కీలక పోలీసు అధికారికి రూ.లక్ష ముట్టినట్లు సమాచారం.

● గుత్తికి చెందిన ఓ అమ్మాయిని కర్నూలు నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. భర్త వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. చట్టబద్ధంగా చర్యలు తీసుకోకుండా, పోలీస్ స్టేషన్‌లో పంచాయితీ చేసి దంపతులను విడదీశారు. ఈ పంచాయితీ చేసినందుకు ఉన్నతాధికారికి రూ.1.20 లక్షలు ముట్టినట్లు సమాచారం. ఓ హెడ్‌కానిస్టేబుల్ మధ్యవర్తిత్వం నడిపినట్లు తెలిసింది.

● కర్ణాటకలోని సిరిగుప్పకు చెందిన వడ్ల వ్యాపారిపై ఫేక్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసు కట్టినందుకు.. కేసు పెట్టించిన వ్యక్తి నుంచి రూ.50వేలు తీసుకున్నారని సమాచారం. ఆ వ్యాపారికి 41 నోటీస్ ఇస్తూ, రూ.20వేలు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది.

● మట్కా బీటర్ల మధ్య ఇటీవల వివాదం తలెత్తింది. రెండు వర్గాలు గొడవపడ్డాయి. ఇందులో ఓ వర్గం వారిని అరెస్ట్ చేశారు. మరో వర్గం వారు డబ్బు ఇవ్వడంతో అరెస్ట్ చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. మట్కా నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతున్నాయని సమాచారం.

లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్య కాదు

భూతగాదాలే కారణం

గుంతకల్లుకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్టు 7

నేటి నుంచి గ్రూప్-1 పరీక్షలు



హోరు గాలి.. జోరు వాన..!

అనంతపురంలో శుక్రవారం రాత్రి కురుస్తున్న వాన (వివరాలు 6వ పేజీలో..)

పిల్లలు జాగ్రత్త

తల్లిదండ్రులకు డీఈఓ సూచన

అనంతపురం విద్య, మే 2(ఆంధ్రజ్యోతి): స్కూళ్లకు సెలవుల నేపథ్యంలో వేసవి ఎండల వేళ.. పిల్లలు బయట ఎండల్లో తిరగకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈఓ ప్రసాద్ బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి వడగాలుల నుంచి పిల్లలను రక్షించుకోవాలన్నారు. ఉదయం నుంచి పుష్కలంగా నీరు తాగేలా చూడాలన్నారు. బయట తిరిగే సమయంలో కాటన్ దుస్తులు, వాటర్ బాటిల్, తలకు టోపీ ధరించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు ఈత కొట్టడానికి ఒంటరిగా వెళ్లకుండా చూసుకోవాలన్నారు. వేసవి వేళ పిల్లల సౌకర్యార్థం కొబ్బరి నీళ్లు, గ్లూకోస్, మజ్జిగ వంటి పదార్థాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాంతులు, విరేచనాలు అయితే వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పిల్లలు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ వివరించారు.







పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



మహిళల విజయ దరహాసం



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

నవశకానికి నాంది..!

(5వ పేజీ తరువాయి)

నాలుగు వరుసల రహదారి విస్తరణకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దీంతో జిల్లాలో ప్రధాన, జాతీయ రహదారుల అనుసంధానం జరిగి రవాణా సౌకర్యాలు మెరుగపడనున్నాయి. కదిరి, హిందూపురం, గోరంట్ల, పాలసముద్రం, పెనుకొండ, మడకశిర ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ పెరిగి పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయి. తద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.

పరిశ్రమల కోసం ఆర్‌ఓబీలు

ఎర్రమంచి కియ కార్ల పరిశ్రమతోపాటు గుడిపల్లి పారిశ్రామిక పార్కు వద్ద, కియ కార్ల అనుబంధ సంస్థలకు అనుసంధానంగా జాతీయ రహదారి 44 వద్ద ఆర్‌ఓబీల నిర్మాణాలను రూ. 124 కోట్లతో చేపట్టనున్నారు. ఈరెండు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రధానమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కియ కార్ల పరిశ్రమ ప్రధాన ప్లాంటు నుంచి అనుబంధ సంస్థలకు అనుసంధానంగా, జాతీయ రహదారికి అనుసంధానంగా ఆర్‌ఓబీల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం మెరుగవడంతో పాటు ప్రమాదాలకు చెక్ పడుతుంది. గుడిపల్లి పారిశ్రామిక వాడలో ఆటో మొబైల్ పరిశ్రమ, కియ అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద బెల్, నాసిన్ పరిశ్రమలకు అనుసంధానంగా రవాణా సౌకర్యం కలగనుంది. అదే విధంగా ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది.

అభివృద్ధికి అనుసంధానం

జిల్లాలో బెంగళూరు- హైదరాబాద్ నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు వరుసల (44వ) జాతీయ రహదారిని 12 వరుసలతో విస్తరణకు కేంద్రం గత ఏడాదే ప్రాథమికంగా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇది కార్యరూపం దాల్చితే జిల్లా అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. కడపజిల్లా మీదుగా బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే జిల్లాలో తలుపుల మండలం లక్కసముద్రం, ఓడులపల్లె గ్రామాల పరిధిలో ప్రారంభమై చిలమత్తూరు మండలం కోడూరు వద్ద 44 జాతీయ రహదారితో కలవనుంది. నాలుగు, ఆరు వరుసలతో నిర్మించే ఈ రోడ్డు పొడవు జిల్లాలో 75 కిలోమీటర్లు ఉండనుంది. గత టీడీపీ ప్రభుత్వం హయంలోనే కొడికొండ-శిర మధ్య 56.80 కి.మీ మేర రూ. 556 కోట్లతో జాతీయ రహదారి 544ఈ నిర్మాణం చేపట్టారు. ముదిగుబ్బ పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా జాతీయ దహదారి 342 నిర్మాణం తుది దశకు వచ్చింది. కదిరి- గోరంట్ల దాకా జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లా సరిహద్దుకు 80 కిలో మీటర్ల దూరంలో దేవనహళ్లి అంతర్జాతీ విమానాశ్రయం ఉండటం, రోడ్ల అభివృద్ధి, అనుసంధానంతో జిల్లా అభివృద్ధికి మార్గం ఏర్పడనుంది.



గోరంట్ల- హిందూపురం రహదారి



వెలగపూడిలో ప్రధానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం.. చిత్రంలో సీఎం

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం

గుంతకల్లుకు సంబంధించిన రెండు రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి మల్లప్పగేట్ వరకూ (గోవా-విజయవాడ లైన్ల అనుసంధానానికి) రూ. 293 కోట్లతో నిర్మించనున్న రైల్ ఓవర్ రైల్ బైపాస్ లైన్ నిర్మాణానికి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అలాగే గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా బుగ్గనపల్లి-బీ సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య విద్యుద్దీకరించిన డబుల్ లైన్ నిర్మాణపు పనులు పూర్తికావడంతో ఆ రైల్వే సెక్షన్‌ను జాతికి అంకితం చేశారు. ప్రధాని శంకుస్థాపన చేసిన వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ ప్రాజెక్టు , బుగ్గనపల్లి-పాణ్యం సెక్షన్ ప్రారంభోత్సవం వల్ల విజయవాడ లైన్‌లో గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కనెక్టివిటీ పెరిగి ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. విజయవాడకు కొత్త రైళ్ల డిమాండ్ ఎక్కువగా ఉన్నా ట్రాక్ సౌలభ్యం లేకపోవడంతో కొత్త రైళ్లను ప్రవేశపెట్టలేదు. డబ్లింగ్ పూర్తయితే రాష్ట్ర రాజధానికి, కొత్త జోనల్ కేంద్రానికి వెళ్లడానికి కొత్త రైళ్లు వచ్చే అవకాశాలు ఏర్పడతాయి. అలాగే వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్ నిర్మాణం జరిగితే కర్ణాటకలోని జిందాల్, తదితర పరిశ్రమల నుంచి సరుకు రవాణా వేగవంతం అవుతుంది. పైగా ప్రస్తుతం గోవా వైపు నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే సరుకు రవాణా రైళ్లు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రావాల్సిన పరిస్థితి ఉంది. బైపాస్ పూర్తయితే గూడ్స్ రైళ్లు గుంతకల్లు స్టేషన్ గుండా కాకుండా నేరుగా వెళ్తాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను సమయానుకూలంగా నడిపే అవకాశం ఏర్పడుతుంది.



సభలో మంత్రి సవిత..



వేదిక వద్ద ప్రధాని మోదీకి మంత్రి సత్యకుమార్ స్వాగతం

హోరు గాలి.. జోరు వాన..!



అనంతపురం నగరంలో వర్షం

అనంతపురం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం, శింగనమల, గార్లదిన్నె, నార్పల, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, పామిడి ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులతో అనంతపురం నగరంలో 8.30 గంటల నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

పగటిని తలపించేలా నింగి.. నేల.. అనంతపురం నగరంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో..



అమరావతి సాకారానికి శ్రీకారం

- చంద్రబాబు పాలనాదక్షతకు దర్పణం
- పనుల పునఃప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతనిధులు

అనంతపురం, మే 2(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రుల కలల రాజధాని అమరావతి సాకారానికి శ్రీకారం చుట్టడం మాకు ఆనందాన్నిస్తోంది. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభమైనందుకు ఎంతో గర్వపడుతున్నాం. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనాదక్షతకు ఇదో దర్పణమ'ని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కొనియాడారు. అమరావతిలో శుక్రవారం నిర్వహించిన రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎన్డీఏ ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతోపాటు ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సభలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. అమరావతిని విధ్వంసం చేసిన చరిత్ర జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని ఏదని చెప్పుకోలేని పరిస్థితిలో వైసీపీ పాలన సాగడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. వైసీపీ విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి బాటలు వేశారన్నారు. ఇది ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆగిపోయిన రాజధాని పనులను ప్రధాని మోదీ పునఃప్రారంభించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలమైన సంకల్పంతోనే అమరావతి దేశంలోని మహానగరాల చెంతన చేరబోతుందనడంలో సందేహం లేదని వారు స్పష్టం చేశారు. ఏపీ భవిష్యత్తును మారుస్తూ ప్రపంచ స్థాయి రాజధాని నగరానికి బీజం పడడం శుభ తరుణంగా వారు పేర్కొన్నారు.

పెద్దారెడ్డి అంటే నాకు సరిపోదు: జేసీపీఆర్

పెద్దవడుగూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అంటే తనకు సరిపోదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఫ్యాక్షన్ మొదలుపెడతానని బహిరంగంగానే హెచ్చరించారన్నారు. అలాంటి విషపు ఆలోచనలు ఉన్న వారు గ్రామాల్లో అన్నదమ్ములుగా జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చు పెడతానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల వైసీపీ నాయకులు ఏర్పాటు చేసే విందులకు పెద్దారెడ్డిని మినహా ఎవరినైనా ఆహ్వానించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎస్‌వీ రవీంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 30 మంది ఎస్సీ మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. రెండు నెలలపాటు సాగే శిక్షణకు 18 నుంచి 35 ఏళ్ల వయసువారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హత సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలతో సాయినగర్ 1వ క్రాస్‌లోని 30వ నంబరు వార్డు సచివాలయం వద్దనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9908620306 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు శనివారం ఉదయం 8 గంటలకు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2012 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన బాలబాలికలు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలు వసూలు

నిందితుడి అరెస్టు

ఉరవకొండ, మే2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని మహిళను నమ్మబలికి రూ.23 లక్షలు వసూలు చేసి, మోసం చేసిన కేసులో నిందితుడు వీరబోయనేని మహేష్ అలియాస్ అక్షయ్‌నందన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ జనార్దన్‌నాయుడు.. వెల్లడించారు. పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన మహిళకు నెల్లూరుకు చెందిన వీరబోయనేని మహేష్ సోషల్ మీడియాలో పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.23 లక్షలు కాజేశాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు జనవరిలో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం అనంతపురం రహదారిలోని కేకే పెట్రోల్ బంకు వద్ద నిందితుడిని అరెస్టు చేసి, సెల్‌ఫోన్ రూ.70వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు వచ్చేలా చూడండి

జడ్పీ సీఈఓకు బాధిత ఉద్యోగుల వినతి

అనంతపురం విద్య, మే 2(ఆంధ్రజ్యోతి): రికార్డు అసిస్టెంట్లతో సమానంగా స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు.. జడ్పీ సీఈఓను కోరారు. సంఘాల నాయకులతో కలిసి వారు శుక్రవారం జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశారు. వారు మాట్లాడుతూ... టీడీపీ హయాంలో ల్యాబ్, లైబ్రరీ అటెండర్ల సమస్యలపై ఉన్నత కమిటీ వేశారన్నారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా రీ-డిసిగ్నేట్ చేశారన్నారు. రికార్డు అసిస్టెంట్లతో సమానంగా ప్రయోజనాలు కల్పించేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గతంలో చంద్రబాబు ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేశారన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. 1997, 1998లో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ల్యాబ్ అసిస్టెంట్లు, లైబ్రరీ అసిస్టెంట్లకు రికార్డు అసిస్టెంట్లతో సమానంగా స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని వారు కోరారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద శుక్రవారం ప్రకటనలో కోరారు. 21 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈనెల 10వతేదీలోపు సచివాలయంలోగానీ, ఇంటర్నెట్ కేంద్రంలోగానీ అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుతోపాటు కులధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డులు, ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం ప్రతులతో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో అందజేయాలన్నారు. వివరాలకు మెప్మా విభాగంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురంరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,100, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవింద తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1081 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

నమోదు చేసుకోండి

పుట్టపర్తి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ ఎంపికకు ముందస్తు నమోదు రిక్రూట్‌మెంటు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల పని చేయాల్సి ఉంటుందన్నారు. బెంగళూరులో ర్యాలీ నిర్వహిస్తారన్నారు. https://agnipathvayo వెబ్‌సైట్‌లో ఈనెల 11వ తేదీ 5 గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్య కాదు

భూతగాదాలే కారణం.. నిగ్గుతేల్చిన పోలీసులు

ముగ్గురి అరెస్టు.. పరారీలో ఏడుగురు..



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఆలూరు పోలీసులు

గుంతకల్లు, మే2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఆలూరు ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్య కాదనీ, భూతగాదా కక్షలే కారణమంటూ పోలీసులు నిగ్గుతేల్చారు. గత నెల 27వ తేదీన గుంతకల్లు-చిప్పగిరి రోడ్డులోని రైలు వంతెన వద్ద ఫ్యాక్షన్ హత్యల్లో నిందితుడిగా ఉన్న లక్ష్మీనారాయణ(60) కారులో వెళ్తుండగా కొందరు కాపుకాచి, టిప్పరుతో అటకాయించి, నరికి చంపిన సంగతి విదితమే. ఆ హత్యతో గుంతకల్లు ప్రజలు, పోలీసులు ఉలిక్కిపడ్డారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్ కుమార్ చిప్పగిరికి చెందిన టీడీపీ నాయకులు వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున చౌదరితోపాటు, కొండా రామాంజనేయులు, అరికెర మల్లేశుపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యపై ఆరోపణలు చేశారు. కేసు విచారణ చేపట్టిన ఆలూరు పోలీసులు ఫ్యాక్షన్ కోణంతోపాటు లక్ష్మీనారాయణ చేసిన పంచాయతీల వల్ల ఏర్పడిన కక్షల నేపథ్యంలోనూ దృష్టిసారించి నేర పరిశోధన చేశారు. ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ బృందాలను నియమించి ఐదు రోజుల్లోనే నేరస్థుల నిగ్గు తేల్చారు. బాధితులు ఆరోపించిన విధంగా కాకుండా భూతగాదాల వల్ల కాంట్రాక్టు హత్య జరిగిందని ఆలూరు పోలీసులు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆలూరు పోలీసు స్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు.

హత్య జరిగిందిలా..

గుంతకల్లుకు చెందిన కొందరు వ్యక్తులతో లక్ష్మీనారాయణకు ఉన్న కక్షలే హత్యకు దారితీశాయని పోలీసులు తెలిపారు. గుంతకల్లులోని గాయత్రి ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న 1.10 ఎకరాల స్థలం, సిద్ధార్థనగర్‌లోని 9 ఎకరాల దేవదాయ భూమి, పెద్దన్న అనే వ్యక్తికి సంబంధించిన 8 ఎకరాల భూమి విషయాలుగా గుంతకల్లుకు చెందిన కొందరితో లక్ష్మీనారాయణకు విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టారన్న కారణంతో కక్షలు పెంచుకుని పథకం ప్రకారం లక్ష్మీనారాయణను హత్యచేశారు. పట్టణానికి చెందిన పెద్దన్న, రాజేశ్, గౌసియాకు భూదందాల విషయంగా లక్ష్మీనారాయణతో విభేదాలు ఏర్పడగా, వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టారు. తమ దందాలకు అడ్డుతగలడమే కాకుండా, ఎస్సీ కేసు కూడా పెట్టాడన్న అక్కసుతో హత్యకు కుట్ర పన్నారు. 27వ తేదీన చిప్పగిరికి బయలుదేరిన లక్ష్మీనారాయణ కారును నిందితుల్లో ఒకరైన రాజేశ్ ద్విచక్రవాహనంలో అనుసరించాడు. మేకల శ్రీనివాసులు, ధర్మ అనే ఇద్దరు పథకం ప్రకారం రైలు వంతెన వద్ద టిప్పరుతో సిద్ధంగా ఉండి, రాజేశ్‌తోపాటు రాము అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు కారును ఢీకొట్టారు. పెద్దన్న తన వద్ద ఉన్న సుత్తితో కారు అద్దాన్ని పగులగొట్టగా, నవీన్ అనే నిందితుడు ఇనుప రాడ్డుతో లక్ష్మీనారాయణ తలపై బలంగా కొట్టాడు. పెద్దన్న తన వద్ద ఉన్న కొడవలితో తలపై నరికాడు. వీరితోపాటు మరికొందరు ఘటనా స్థలంలో ఉండి ఎవరూ దగ్గరకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హత్యానంతరం అందరూ పారిపోయారు.

ముగ్గురి అరెస్టు

ఎమ్మార్పీఎస్ నాయకుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య వెనుక 10 మంది హస్తం ఉందని పోలీసులు వెల్లడించారు. గుంతకల్లుకు చెందిన పెద్దన్న, రాజేశ్, బేపార్ గౌసియా, మేకల శ్రీనివాసులుతోపాటు బీ రాము, బీ గోవిందు, వడ్డే నవీన్, ధర్మ, మనోహర్, కత్రిమల సౌభాగ్య ఉన్నారని దర్యాప్తులో తేలిందని పోలీసులు వివరించారు. వీరిలో పెద్దన్న, రాజేశ్, గౌసియా గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి హైవేలో ఉండగా అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన ఏడుగురు పరారీలో ఉన్నారనీ, త్వరలో వారందరినీ అరెస్టుచేస్తామని వివరించారు. కాగా బాధితులు అనుమానించిన ప్రసాద్, మల్లికార్జున, మల్లేశ్, రామాంజనేయులుకు ఈ హత్యలో ప్రమేయం లేదని వివరించారు. బాధితులు పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్యపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారాలని తేలింది.

నేటి నుంచి గ్రూప్-1 పరీక్షలు

రెండు కేంద్రాలు... 594 మంది అభ్యర్థులు

అనంతపురం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9వరకు కొనసాగనున్నాయి. ఈపరీక్షలకు 594మంది అభ్యర్థులు హాజరుకానున్నారని ఇప్పటికే కలెక్టరు వినోద్‌కుమార్ వెల్లడించారు. గ్రూప్-1 పరీక్షలను నగరంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల, శ్రీబాలాజీ పీజీ కళాశాల కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు కొనసాగనున్నాయి. పీవీకేకే కళాశాలలో 234మంది, శ్రీబాలాజీ పీజీకాలేజ్‌లో 360మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

ఏర్పాట్లు సిద్ధం

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టరు రెండుసార్లు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణపై పలు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు ముగిసేవరకు జేసీ శివనారాయణశర్మ కోఆర్డినేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్ సెంటర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీకలెక్టరు రామ్మోహన్, శ్రీబాలాజీ పీజీ కాలేజ్ సెంటర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డిలను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించి వారికి పరీక్షల నిర్వహణ, నిబంధనలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మెటీరియల్, యంత్రాలు, ట్యాబ్‌లు, ఫర్నిచర్స్ ఏర్పాటు చేశారు. కాగా అభ్యర్థుల సమస్యలు, అనుమానాలు తీర్చడం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈకంట్రోల్ రూమ్ గురువారం నుంచి ఈనెల 9వతేదీ వరకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు తమసమస్యలు తెలియజేయాలంటే 8500292992, 08554-220009 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు.

అమ్మను మించిన దైవం లేదు

గణపతి సచ్చిదానంద స్వామి



హారతి ఇస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో మూడు రోజుల నుంచి జయలక్ష్మీమాత జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జయలక్ష్మీమాత జయంతి సందర్భంగా విగ్రహానికి గణపతి సచ్చిదానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకరపూజ, రుద్రహోమం, చక్రపూజ ఘనంగా చేశారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గణపతి సచ్చిదానంద స్వామి.. భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

కాంక్రీట్ మిల్లర్ అపహరణ

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యానగర్ రోడ్డు మల్లాలమ్మ గుడి ఎదుట ఉన్న కాంక్రీట్ మిల్లర్‌ను దొంగలు అపహరించారు. గతనెల 28వ తేదీన మిల్లర్‌ను అపహరించినట్లు సుధాకర్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

గుడిబండ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ హట్టి గ్రామానికి చెందిన మహేష్ భార్య రోజా(28) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ రమణ తెలిపిన మేరకు కొన్నేళ్ల నుంచి రోజా కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించానా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరి వేసుకుంది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి పుట్టరంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. డ్రైవర్ మృతి

ముగ్గురికి గాయాలు

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లి సమీపాన జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ దుర్మరణం చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక ప్రాంతం దేవనహళ్లికి చెందిన నలుగురు అనంతపురం నుంచి బెంగళూరుకు కారులో బయల్దేరారు. రామినేపల్లి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మంజునాథ్ (44) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ప్రదీప్, నగేష్, మోహన్‌రాజ్ గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

డ్రైవర్ మంజునాథ్ మృతదేహం

బాలిక నిజాయతీ

ఏటీఎంలో డ్రా అయిన డబ్బు బాధితుడికి అందజేత



డబ్బు అందజేస్తున్న సీఐ, వర్ణిక

తాడిపత్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం సెంటర్‌కు గతనెల 30న సాయంత్రం వెళ్లిన వర్ణికకు లభించిన రూ.9వేలు పోలీసులకు అప్పగించారు. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు... 30న సాయంత్రం ఏటీఎంలో ఎవరో డబ్బులు విత్‌డ్రా చేయాలని ప్రయత్నించారు. ఎంతసేపటికి డబ్బులు రాకపోవడంతో అతను వెళ్లిపోయాడు. కాసేపటికే వర్ణిక అనే బాలిక ఏటీఎం వద్దకు డబ్బు విత్‌డ్రా చేయడానికి వచ్చారు. అయితే అప్పటికే విత్‌డ్రా అయిన సొమ్ము రూ.9వేలు కనిపించడంతో దాన్ని తీసుకొని సీఐకు అప్పజెప్పారు. సీఐ బ్యాంక్ అధికారులను పిలిపించి ఏటీఎంలో ఉన్న సీసీ ఫుటేజీల ద్వారా బాధితుడిని గుర్తించారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌నాయక్ అని తేలడంతో అతన్ని పిలిపించి ఆ డబ్బులను ఆ అమ్మాయి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు.

పింఛన్‌పై డీఎల్‌డీవో విచారణ

బెళుగుప్ప, మే 2(ఆంధ్రజ్యోతి): పింఛన్ పంపిణీ చేయకుండా సచివాలయ సిబ్బంది పరారైన సంఘటనపై డీఎల్‌డీవో నాగేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర గురువారం పింఛన్ల నగదు రూ. 2.58 లక్షలతో ఉడాయించిన విషయం తెలిసిందే. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సెక్రెటరీ శివరంజని, సిబ్బంది దేవేంద్రతో ఎంపీడీవో కార్యాలయంలో ఈ సమస్యపై విచారించారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. తమకు ఇంకా పింఛన్ల డబ్బు అందలేదంటూ లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయానికి తరలివచ్చారు. కాగా ఉపేంద్ర ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.



ఎంపీడీవో, కార్యదర్శితో వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీవో

అయ్యో.. నాన్నా..!

విద్యుదాఘాతంతో ఒక్కగానొక్క కుమారుడి మృతి

సమాచారం తెలిసి.. సబ్‌జైలులో సొమ్మసిల్లిన తండ్రి



అశ్విన్ ఆరాధ్య (ఫైల్)

హిందూపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకున్నారు. విధి వక్రించింది. కుమారుడిని కరెంటు బలి తీసుకుంది. తల్లిగుండె తల్లడిల్లింది. సబ్‌జైలులో ఉన్న తండ్రి గుండె పగిలింది. స్పృహ కోల్పోయాడు. సబ్‌జైలు నుంచి ఆస్పత్రికి చేరాడు. వారి పరిస్థితిని చూసిన వారంతా.. అయ్యో.. పాపం.. అంటూ ఆవేదన చెందుతున్నారు.

వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, చందన దంపతుల కుమారుడు అశ్విన్ ఆరాధ్య (11) పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతుండేవాడు. సెలవులు కావడంతో ఇంటివద్దే ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం దండు రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. బంతి పాఠశాల మేడపైకి వెళ్లింది. అశ్విన్ బంతి తీసుకునేందుకు మిద్దెపైకి ఎక్కాడు. మేడపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకాడు. షాక్ తగిలి పడిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని, విద్యార్థిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో తల్లి చందన రోధించినతీరు అందరినీ కలచివేసింది.

సొమ్మసిల్లిన తండ్రి

విద్యార్థి తండ్రి వాల్మీకి లోకేష్ ఇటీవల టీడీపీ కార్యకర్త ఇంటి వద్దకు ఇనుప రాడ్‌తో వెళ్లడంతో పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం హిందూపురం సబ్‌జైలులో ఉన్నాడు. కుమారుడి మృతి విషయం తెలుసుకుని లోకేష్ బోరున రోదించినట్లు తెలిసింది. స్పృహ తప్పి పడిపోవడంతో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. కుమారుని అంత్యక్రియల కోసం బెయిల్ ఇవ్వాలని, లేదంటే అంత్యక్రియలు ముగిసేవరకు వెళ్లడానికి అనుమతి అయినా ఇవ్వాలని న్యాయాధికారిని కోరినట్లు లోకేష్ తరఫు న్యాయవాది తెలిపారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



రూపేష్ (ఫైల్)

నంబులపూలకుంట, మే2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమల గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ పక్కనున్న యనుముల గంగన్న బావిలో ఈతకెళ్లి విద్యార్థి రూపేష్ (14) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి రూరల్ మండలంలోని పట్నంకు చెందిన వీఆర్వో గంగాధర్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రూపేష్ కదిరిలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో అమ్మమ్మ ఊరైన వెలిచెలమలకు రెండురోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం స్నేహితులతో గ్రామ సమీపంలోని యనుముల గంగన్న బావిలో ఈతకెళ్లాడు. స్నేహితులు ఈత కొడుతుండగా, సరదాగా ఉందని రూపేష్ బావిలోకి దూకేశాడు. బయటకు రాకపోవడంతో స్నేహితులు గ్రామంలో తెలిపారు. గ్రామస్థులు బావి వద్దకు చేరుకుని, విద్యార్థి మృతదేహాన్ని యటకు తీశారు. అప్పటికే మృతిచెందాడు. దీనిపై పోలీసులను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ఎలుగుబంటి దాడి.. ఇద్దరికి తీవ్రగాయాలు



దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన కరియన్న, మూర్తి ఇద్దరు శెట్టూరు మండలం గొల్లపల్లి గ్రామానికి వెళ్లి అర్ధరాత్రి సమయంలో తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనానికి ఎలుగుబంటి అడ్డుపడింది. కరియన్న పై దాడి చేసింది. గట్టిగా కేకలు వేయడంతో అక్కడికి కొంతమంది ప్రజలు వచ్చారు. వారిలో శ్రీనివాసులు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితులను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు దాదాపు 60 కుట్లు వేశారు. శ్రీనివాస్ చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రెండు లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. కాగా గ్రామ పరిసరాల్లో వన్యమృగాలు సంచరిస్తూ, దాడి చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం ఇద్దరిని అరెస్టు చేశారు. పదిరోజుల క్రితం ఫోర్త్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైంది. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు విచారించగా కళ్యాణదుర్గం మండలం కొండాపురం గ్రామానికి చెందిన వడిత్యా రామకృష్ణనాయక్.. బాలికను తీసుకెళ్లినట్లు తేలింది. అదే గ్రామానికి చెందిన కమలాక్షిబాయి అతడికి సహకరించినట్లు నిర్ధారించారు. దీంతో పోక్సో కేసుగా మార్చారు. గతనెల 30న దేవేంద్ర పాడులో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం రామకృష్ణనాయక్, కమలాక్షిబాయిని అరెస్టు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



లేపాక్షి, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం దుకాణం సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బార్ పక్కనే శుక్రవారం ఉదయం నుంచి 55 ఏళ్ల వయసున్న వ్యక్తి పడి ఉన్నాడు. కొంతమంది అనుమానం వచ్చి సాయంత్రం పరీక్షించగా మృతిచెందినట్లు గుర్తించారు. అతడి జేబులో మందుబాటిల్, బీడీలు, అగ్గిపెట్టె ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

మహిళా కార్యాలయాల వద్ద మద్యం దుకాణం

● సమీపంలో ఐసీడీఎస్, మహిళా సమాఖ్య, కుట్టు శిక్షణ కేంద్రాలు ● పట్టించుకోని అధికారులు

శింగనమల, మే 2(ఆంధ్రజ్యోతి): నిత్యం మహిళలు సంచరించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. నిబంధనలు తుంగలో తొక్కి మద్యం దుకాణం ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోలేదు. నిత్యం మహిళలు వచ్చే ఐసీడీఎస్ కార్యాలయం, మహిళా సమాఖ్య కార్యాలయం, దీనికితోడు మహిళా కుట్టు మిషన్ శిక్షణ కార్యాలయం ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణానికి అనుమతించిన అధికారుల తీరుపై మహిళలు మండిపడుతున్నారు. తూతూ మంత్రంగా విచారణ చేసి నింబధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో శింగనమలలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. గురువారం ఉన్న ఫలంగా మద్యం దుకాణాన్ని మార్చుచేశారు. మహిళలు నిత్యం సంచరించే ప్రాంతం కావడంతో విమర్శలు వస్తున్నాయి. మద్యం దుకాణానికి 10 మీటర్ల దూరంలోనే మండల మహిళా సమాఖ్య కార్యాలయం, మహిళ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం, దాని పక్కనే ఐసీడీఎస్ కార్యాలయం, 30 మీటర్ల దూరంలో బాలుర వసతి గృహం ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు నింబంధలను తుంగలో తొక్కి అనుమతులు ఇచ్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు..


కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

నిబంధన మేరకే ఏర్పాటు

శింగనమలలో నిబంధనల మేరకే మద్యం దుకాణం ఏర్పాటు చేశాం. గతంలో ఉన్న దుకాణంతో ఇబ్బందులు ఉన్నాయని ఉన్నతాధికారులకు యజమానులు విన్నవించుకున్నారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు మార్చడానికి అనుతించాం. నిబంధనల ప్రకారం 100 మీటర్ల దూరంలో పాఠశాల, దేవాలయాలు ఉండకూడదు. ఆ ప్రకారమే ఇక్కడ అనుమతి ఇచ్చాం. ఇక్కడ మహిళలు సంచరించే ప్రాంతమని ఫిర్యాదులు వస్తున్నాయి. మరోసారి విచారణ చేపడతాం.

-నాగసునీత, సీఐ, ఎక్సైజ్ శాఖ

వైభవంగా శంకర జయంతి

బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం ఆధ్వర్యంలో రథోత్సవం

అనంతపురం కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ శుద్ధ పంచమి, జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం నుంచి బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం ఆధ్వర్యంలో శంకరాచార్యుల ఉత్సవమూర్తిని రథంలో ఊరేగించారు. రథోత్సవం ముందు ఓం సంగీత కోలాట శిక్షణాలయం ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు కోలాటమాడుతూ అలరించారు. ఆలయంలో శంకరాచార్యుల మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక ధర్మోపనయనాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 35 మంది వటువులు హాజరై ఉపనయనాలు చేయించుకున్నారు. వేదపండితులు ముక్కాల విద్యాధరశాస్త్రి, కోడూరు అమర్‌నాథ్‌శర్మ నేతృత్వంలో అర్చకబృందం బ్రహ్మోపదేశం గావించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం అధ్యక్షుడు శివరామ్, కార్యదర్శి సాయిశివరాం, సహాయ కార్యదర్శి రఘురామారావు, బ్రాహ్మణ వసతిగృహం హోసూరు రామసుబ్రహ్మణ్యం, మధు, రమణ, రవికుమార్, సతీష్, రాఘవేంద్ర జోషి, నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య తదితరులు పాల్గొన్నారు.


మొదటిరోడ్డులో శంకరాచార్యుల రథోత్సవం, ఆలయంలో పూజలందుకుంటున్న శంకరాచార్యులు

శంకరమఠంలో...

శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలోనూ శంకర జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరాచార్యుల మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. కార్యక్రమంలో మఠం ఇన్‌చార్జి సత్యప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తన పంపిణీ చేయాలి: రైతు సంఘం

అనంతపురం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మను ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం జేడీఏ కార్యాలయంలో ఆమెకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, నాయకులు సంజీవరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి అందజేశారు. ఐదు ఎకరాల వరకు ఎకరాకు 3 బస్తాల విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని కోరారు. వేరుశనగ, కందులు, ఉలవ ఇతర విత్తనాల కేటాయింపులు తగ్గించడం అన్యాయమన్నారు. పంట విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని విత్తన కేటాయింపులు పెంచాలన్నారు. అంతర, ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. పత్తి, వరి, మొక్కజొన్న ఇతర విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీతో అందించాలన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతా లో జమ చేయాలన్నారు. ఉచిత పంటల బీమాను ప్రకటించి, అమలు చేయాలన్నారు.


జిల్లా వ్యవసాయశాఖ అధికారితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

వాసవీమాతకు అభిషేకం


వాసవీమాతకు తేనె అభిషేకం, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం వాసవీమాతకు తేనె అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో 90 కేజీల తేనెతో భక్తుల చేతులమీదుగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు మైలవరం నిర్మలాదేవి, భక్తులు పాల్గొన్నారు.

అరుణమ్మకు ఐద్వా నివాళులు

అనంతపురం కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమిటీ రాష్ట్ర కోశాధికారిగా పనిచేసిన అరుణమ్మకు ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అరుణమ్మ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సంతాప సభకు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జేవీవీ సమత కన్వీనర్ డాక్టర్ ప్రసూన ముఖ్యఅతిథులుగా హాజరై అరుణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనంతపురం జిల్లాలో ఐద్వా సంస్థాపకుల్లో అరుణమ్మ కూడా ఒకరన్నారు. అరుణమ్మ హైదరాబాద్‌లో ఐద్వా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మహిళలకు కౌన్సిలింగ్ సెంటర్ కూడా నడిపారన్నారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, ఐద్వా జిల్లా నాయకులు చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.


అరుణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా సభ్యులు

పీహెచ్‌డీ ప్రవేశాల్లో వైవాను తొలగించాలి



ఢిల్లీలో విజయంపై సంబరాలు చేసుకుంటున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 2(ఆంధ్రజ్యోతి): పరిశోధన విద్యార్థులకు వివిధ కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించే ప్రక్రియలో వైవా(మౌఖిక ఇంటర్వ్యూ) విధానాన్ని తొలగించాలని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన డిమాండ్ చేశారు. ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి ఎన్నికల్లో ఏఐఎస్‌ఏ గెలుపై శుక్రవారం ఎస్కేయూ ప్రధాన ముఖద్వారం వద్ద వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేమన కేక్‌కట్‌చేసి వేడకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పరిశోధనలకు విశ్వవిద్యాలయాలు నిలయాలన్నారు. పారదర్శకంగా ప్రవేశాలను చేపట్టినప్పుడే అర్హతగల విద్యార్థులు పీహెచ్‌డీలో సీటు లభిస్తుందన్నారు. మెరిట్‌లో ఎన్ని మార్కులు వచ్చినా వైవా పేరుతో అన్యాయం చేస్తున్నారని అన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు అద్దంపడుతూ ఢిల్లీ జేఎన్‌యూ అధ్యక్షుడిగా ఏఐఎస్‌ఏ నితీష్‌కుమార్ నాయకత్వం ఎన్నికైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, యామన్న, కృష్ణ, ఆనంద్, అశోక్, అరుణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రాప్తాడు, మే 2(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసం- వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళిక పోస్టర్లు విడుదల చేశారు. కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. మే 2 నుంచి జూన్ 10 వరకూ ఈ కార్యక్రమం జరుగుతందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదవాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాలు, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, సూపర్వైజర్లు నాగరత్న, హేమలత పాల్గొన్నారు.

● శింగనమల : సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికడదామని శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాశంకరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం శింగనమలలో అంగన్వాడీ సింబ్బందితో కిశోర బాలికల సమ్మర్ క్యాంపులో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సుపవైజర్లు ధనలక్ష్మి, ఉమాదేవి, సోషల్ వర్కర్ వసంత పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ మహోత్సవాలు

బుక్కరాయసముద్రం, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద రూ.3.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన హరిహర అయ్యప్పస్వామి దేవాలయం ప్రతిష్ఠ ఉత్సవ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 9 తేది వరకు ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, 18 మెట్ల పూజ, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సంబధించి కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శబరిమలలో ఉన్న ప్రధాన దేవాలయం తరహాలో బుక్కరాయసముద్రం వద్ద తాడిపత్రి రోడ్డు పక్కనే సర్వాంగ సుందరంగా నిర్మించారు. శబరిమల తరహాలోనే 18 మెట్లు నిర్మించారు. ఆలయంలో ప్రతిష్ఠించే అయ్యప్పస్వామి విగ్రహానికి దాదాపు 30 తులాల బంగారు, రెండు కిలోల వెండితో పాటు, పంచలోహాలు వినియోగించారు. వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహిస్తున్నారు. కేరళలోని శబరిమల ప్రధాన ఆలయం అర్చకులు రాజీవర్ తంత్రి, బ్రహ్మదత్త కంఠారు ఆధ్వర్యంలో ఈ నెల9న విగ్ర ప్రతిష్ఠ చేయనున్నారు. అయ్యప్పస్వామి విగ్రహంతో పాటు దేవాలయంలో హరిహరలు, మాలికాపురత్తమ్మ, ఆంజనేయస్వామి, కాళభైరవ , శివలింగ, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారం రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.


నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం, ప్రతిష్ఠకు సిద్ధంగా అయ్యప్ప విగ్రహం

న్యూస్ బాక్స్

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం


కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరోరోడ్డులో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఫోన్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి, ఇస్మాయిల్, బోయ రాము, రామాంజనేయులు, మెప్మా అధికారులు, కేంద్రం నిర్వహణ సభ్యులు రజియా, గీతావాణి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పబ్లిక్ హెల్త్ ఎస్ఈ



అనంతపురం క్రైం,మే2(ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)గా రామమోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పబ్లిక్ హెల్త్‌లోనే ఇన్‌చార్జ్ ఎస్ఈగా, రెగ్యులర్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామమోహన్‌కు ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్ఈకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన గతంలో అనంతపురం నగరపాలిక ఇన్‌చార్జ్ ఎస్ఈగా, ఈఈగా పనిచేశారు.

భగీరథ జయంతిని జయప్రదం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 2(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించే భగీరథ మహర్షి జయంతిని జయప్రదం చేయాలని ఆ శాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కులసంఘాలనాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైసీపీ ఎస్సీ విభాగం కార్యదర్శిగా రామాంజనేయులు

నార్పల, మే 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శిగా సాకే రామాంజనేయులు నియమితుయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శిగా రామాంజనేయులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

10న గుంటు ఓబులేసుస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు సమీపంలోగల కురుకుండ్లకాలనీలో ఈనెల 10న గుంటు ఓబులేసుస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటాయని ఆయన కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 10,11 తేదీలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొంది.

యూనియన్ నాయకులతో కమిషనర్ సమావేశం

అనంతపురం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్ల సమస్యలపై నగర కమిషనర్ బాలస్వామి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. శుక్రవారం తన చాంబర్‌లో మూడు సంఘాలతో వేర్వేరుగా మాట్లాడారు. సీఐటీయూ తరఫున నాగభూషణం, ఏటీఎం నాగరాజు, ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అజయ్‌బాబు, ఏఐటీయూసీ నుంచి రాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు కార్మికుల సమస్యలు వివరించారు. త్వరలోనే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో వెంకటేష్‌ను అనే రైతుకు చెందిన గడ్డివాము శుక్రవారం సాయంత్రం అగ్నికి దగ్ధమయింది. రైతు పశువుల మేత కోసం ఇంటి వద్ద దొడ్డిలో గడ్డిని వాముగా ఏర్పాటు చేసుకున్నాడు. వాము నుంచి మంటలు వ్యాపించాయి. గమనించిన రైతుతో పాటు స్థానికులు మంటలను ఆదుపుచేశారు. రూ. 30వేలు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజుపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆటోను ఓ ప్రైవేటు బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ కు తీవ్రగాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఈశ్వర్‌బాబు తన సొంత ఆటోలో ప్లైవుడ్, ఇతర వస్తువులతో బాడుగకు అనంతపురం నుంచి హిందూపురం వెళ్తున్నాడు. దామాజుపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి ఓ ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ కాలు విరగడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన ఆటో డ్రైవర్

వైశ్యా హాస్టల్ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ

అనంతపురం కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైశ్య హాస్టల్ అధ్యక్షుడిగా మేడా రామనాథ్ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 20వ తేదీన అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికలో మేడా రామనాథ్ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం వైశ్య హాస్టల్‌లోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదిశేషయ్య, తిరువీదుల జగదీష్‌కుమార్, హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడు పొలమడ రమేష్‌బాబు, సత్యరంగయ్య, ముంటిమడుగు నాగరాజు, టంగుటూరి నాగభూషణంలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మేడా రామనాథ్

జీతాల కోసం కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

అనంతపురం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): జీతాలు కోసం జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. జిల్లా ఆసుపత్రి ఆవరణంలో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం వరకు బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు రాజారెడ్డి, రాజేష్ మాట్లాడుతూ.. ఏజెన్సీలు ఇప్పటి వరకు ఎప్పుడూ జీతాలు సక్రమంగా చెల్లించడంలేదన్నారు. నెలలతరబడి జీతాలు ఇవ్వకుంటే పేదకార్మికులు పట్టణ ప్రాంతంలో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జీతాలు నెలానెలా ఇప్పించాలని అనేకసార్లు కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని, ఏజెన్సీలకే వంతపాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్టుడు, మనోహర్, నల్లమ్మ, శోభా, భార్గవి, వన్నూరు, శివా, అంజలి, రేష్మా, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిషోర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం


కిషోర్ కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న రవినాయుడు, మోపిడి రామాంజనేయులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా జాలీబాయ్స్ ఆర్కెస్ట్రా- ఈవెంట్స్ అధినేత గ్రంధే కిషోర్ నిర్మించిన కిషోర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థల యజమాని మోపిడి రామాంజనేయులు చేతుల మీదుగా మెయిన్ హాల్, మిత్రుడు అపెక్స్ రవినాయుడు చేతుల మీదుగా డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా శుభకార్యాలలో వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించిన జాలీ బాయ్స్ నిర్వాహకులు కన్వెన్షన్ హాల్ వైపు అడుగుపెట్టారు. అత్యాధునిక వసతులతో విశాలమైన పార్కింగ్, మెయిన్‌రోడ్డుకు ఆనుకుని కన్వెన్షన్‌హాల్ నిర్మించారు. హాల్ బుకింగ్, ఇతర వివరాల కోసం సెల్ నంబర్లు 9440464365, 8247648203, 9949124585ను సంప్రదించాలని కిషోర్ కోరారు. కార్యక్రమంలో కిషోర్ సతీమణి శైలజ, తనయుడు కుందన్, తనయి తన్మయి, మిత్రులు కుప్పం మధుసూదన్, మెడినోవా శివారెడ్డి, ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, రఘువరణ్ చిట్స్ అధినేత నాగభూషణం, ఖదర్ నాగరాజు, ఎస్ఎల్‌వి వెంకటేష్, బంధువులు, స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

ఉక్కపోతతో అవస్థలు పడ్డ జనం

అనంతపురంరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎండ వేడిమి..ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సంబంధిత సిబ్బందికి ఫోన్ చేసి స్పందించకపోవడం.. అధికారుల ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో సమస్యను ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం మండలంలోని అక్కంపల్లి, ఎస్ఆర్ కాలనీ, కురుగుంట, చంద్రప్రియానగర్, సిండికేట్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలైన ఇదే పరిస్థితి కొనసాగింది. ఎండ వేడిమి, ఉక్కపోతతో ఇంటా..బయట కూడా ఉండలేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది..అధికారులు స్పందిచకపోవడంతో స్థానికులు మండిపడ్డారు. రెండు రోజుల తపోవనం, సిండికేట్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో నెలకొన్న హెచ్చుతగ్గులతో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోయాయి. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని జనం వాపోతున్నారు. నరసనాయనికుంట ఎస్సీ కాలనీలో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నెలకొంటున్నాయి. రుద్రంపేటలోని పలు ప్రాంతాల్లో ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ముంటిమడుగుకు తెలుగుయువత నాయకుల సన్మానం

గార్లదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డిని శుక్రవారం ఆయన స్వగృహంలో కల్లూరుకు చెందిన తెలుగు యువత నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు, బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సామాల మధు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కేశవరెడ్డిని సన్మానిస్తున్న తెలుగుయువత నాయకులు

ఆర్డీటీ కోసం రిలే దీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అభివృద్ధికి సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు వారం రోజులపాటు సాగే దీక్షలకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఓబులేసు, రామన్న, రమేష్, చిరంజీవి, శ్రీనివాసులు, అంజి, రవినాయక్ పాల్గొన్నారు.


డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

● నార్పల : ఆర్డీటీకి నిధులను అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా దళిత, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం నార్పలలో శాంతి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేదాంతం, నాగరత్నమ్మ, మిద్దికుళ్లాయప్ప, సాకే రామాంజనేయులు, రాజగోపాల్, శైలజరాణి, పుల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.



నార్పల ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

గుంటూరు మేయర్‌ను కలిసిన టీడీపీ నాయకులు


మేయర్‌తో టీడీపీ మండల నాయకులు

పుట్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రను టీడీపీ పుట్లూరు మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు తెలిపారు. ఇటీవలే నగర మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి రవీంద్రను గుంటూరులో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ద్విసభ్య కమిటీ సభ్యుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడుతో పాటు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో మండల మాజీ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, యల్లనూరు మండల నాయకుడు చంద్రశేఖర్‌నాయుడు ఉన్నారు.

పయ్యావుల శ్రీనివాసులును కలిసిన ముంటిమడుగు


పయ్యావుల శ్రీనివాసులుతో ముంటిమడుగు కేశవరెడ్డి

ఉరవకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురంలోని రాంనగర్‌లో శుక్రవారం కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఏడీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని చైర్మన్‌కు పయ్యావుల శ్రీనివాసులు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకుడు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

గుంతకల్లు, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శుక్రవారం తనిఖీలు చేశారు. స్టేషన్ మాస్టర్ చాంబర్‌లో రైల్వే సిబ్బందికి భద్రతాపరమైన సూచనలిచ్చారు. అనంతరం నార్త్, సెంట్రల్ కేబిన్లను సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అలాగే ట్రాక్‌లను కలిపే లింక్‌ల పనితీరును పరిశీలించారు. మెకానికల్, మెయింటెనెన్స్, అడ్మినిస్ట్రేషన్ అధికారులు పాల్గొన్నారు.

కసాపురంలో ఉపనిషత్తు పారాయణం


పూజలు చేస్తున్న వేదపండితులు

గుంతకల్లుటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రామానుజ చార్య స్వామి, భగవత్ పాద శంకరచార్య స్వామి జయంతిల సందర్భంగా ఉపనిషత్తు పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు ఆలయంలోని యాగశాలలో స్వామి వార్ల చిత్రపటాలను కొలువుదీర్చారు. ఉపనిషత్తు పారాయణం, పలు పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి: ఏఐఎస్‌ఎఫ్

గుంతకల్లు టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. అలాగే పుస్తకాలు, యూనిఫాం, ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రోహిత్, శివమణి, సహాయకార్యదర్శి ఫర్హాన్, నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా..

రాయదుర్గం, మే 2(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపడడానికి రాయితీపై నాణ్యమైన దాణాను ప్రభుత్వం అందజేయనుందని పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా రాయదుర్గం మండలానికి 20 నుంచి 25 టన్నుల పశువుల దాణాను కేటాయించినట్లు చెప్పారు. 50 కేజీల దాణా పూర్తి రేటు రూ. 1110 కాగా 50 శాతం సబ్సిడీ పోను రైతు రూ. 555లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాణా కావాల్సిన వారు తెల్లరేషన్ కలిగి ఉండాలన్నారు. ఒక పాడి రైతుకు 50 కేజీల దాణా మాత్రమే ఇవ్వనున్నామని చెప్పారు. భారత పశుదాణా యాప్‌లో యజమాని పేరు మీద పశువు చెవి కమ్మ లేదా టాగ్ నెంబర్ నమోదు అయి ఉండాలని అన్నారు. ఎస్సీ/ఎస్టీ నిష్పత్తి ఆధారంగా పశుదాణాను కేటాయించనున్నట్లు చెప్పారు. నమోదు కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

గుంతకల్లుటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ. సురేష్ మాట్లాడుతూ... చత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యాన్ని, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్ట కొండలను పారా మిలటరీ దళాలు, సైన్యము చుట్టుముట్టి మావోయిస్టు నాయకులను, కార్యకర్తలను, ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం తగదన్నారు. దీన్ని దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కాల్పులను విరమించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు జిలాన్, రామాంజనేయులు, షెక్షావలి, నారాయణ, బాషా, గోపి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రూ. 3.70 లక్షలు చోరీ

రాయదుర్గం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయకసర్కిల్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం నగదు చోరీకి గురైంది. డీ.హీరేహాళ్ మండలం ఎం హనుమాపురం గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి రాయదుర్గం పట్టణంలోని యూనియన్ బ్యాంకులో రూ. 3.70 లక్షల నగదును డ్రా చేశాడు. అనంతరం బయట తన ద్విచక్రవాహనానికి ఉన్న సైడ్‌బ్యాగులో డబ్బులు పెట్టి పక్కనే ఉన్న ఓ దుకాణం వద్దకు వెళ్లి వ్యాపారం చేస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి నగదును చోరీ చేశారు. డబ్బులు పోయినట్లు గుర్తించిన బాధిత రైతు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

విద్యాశాఖ కార్యాలయానికి పాఠ్య పుస్తకాలు

బెళుగుప్ప, మే 2(ఆంధ్రజ్యోతి): పాఠ్య, నోటు పుస్తకాలు శుక్రవారం మండలకేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. 1504 పాఠ్య పుస్తకాలు, 22974 నోట్ పుస్తకాలు చేరినట్లు ఎంఈఓ-2 హరికృష్ణ తెలిపారు. పూర్తిగా వచ్చిన తరువాత వాటిని ప్రభుత్వ పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

వర్షానికి కూలిన మిద్దె


పడిపోయిన మిద్దె

కుందుర్పి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాయదార్లపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మిద్దె కూలింది. అయితే అదృష్టవశాత్తూ అందులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్రామానికి చెందిన మర్రిస్వామి రోజూమాదిరిగానే భార్య, పిల్లలతో ఇంటిలోని వరండాలో పడుకున్నారు. రాత్రి వడగండ్ల వర్షం కురవడంతో ఇంట్లోని లోపల గది ఒక్కసారిగా కూలి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో వారు ఉలిక్కిపడి నిద్రలేచి బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లోని వంట సామగ్రి ధ్వంసమయ్యాయి. బియ్యం నేలపాలయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి
- సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ


సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

యాడికి, మే 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. అందులో భాగంగా యాడికి, పెద్దవడుగూరు మండలాల్లోని అర్హులైన రైతులకు రూ.25లక్షల సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ పనిముట్లకు ఇంకా అర్హులైన వారు ఉంటే ఒకటిరెండురోజుల్లోపు వ్యవసాయ అధికారులను కలిస్తే అందజేస్తారని తెలిపారు. రైతుల అవసరానికి తగ్గట్లు విత్తన పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై స్ప్రింగ్ టిల్లర్లు, రోటావేటర్లు, విత్తన గొర్రులు, స్ప్రేయర్లు, మడకలు తదితర వాటిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకటరాముడు, యాడికి, పెద్దవడుగూరు మండలాల వ్యవసాయాధికారులు మహబూబ్‌బాషా, మల్లీశ్వరి, యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటీ ఎంపీడీ ఓ శశికళ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు నాగమునిరెడ్డి, చలమారెడ్డి, పరిమి చరణ్, త్రినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి పరామర్శ..

యాడికి: మండలకేంద్రానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆదినారాయణ రోడ్డుప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరాతీశారు. ఏ సహాయం అవసరమైనా తనను నేరుగా సంప్రదించాలని తెలిపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పుప్పాల సర్పంచు దేవేంద్ర, పలువురు నాయకులు ఉన్నారు.

పలు వార్డుల్లో పర్యటన..

తాడిపత్రి: పట్టణంలోని ఆసుపత్రిపాలెం, బుక్కపట్నం వీధి, కాల్వగడ్డవీధి ప్రాంతాల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ కాలనీల్లో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా పింఛన్‌లు సక్రమంగా అందుతున్నాయా అని పలువురు వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, కౌన్సిలర్ రేష్మాపర్వీన్, విజ్జి, నాగరంగయ్య, రంగనాథరెడ్డి తదితరులు ఉన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన


యాడికిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపరవైజర్

గుంతకల్లు టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, పక్కీరప్పకాలనీ, దిద్దికొట్టాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో జిల్లా బాలల పరిరక్షణసమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా బాల్యవివాహాల కలిగే నష్టాల గురించి వివరించారు. బాల్యవివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తర్వాత బాలికల విద్య, న్యూట్రిషన్, ఐరన్‌లోపం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, యోగా, ఫిట్‌నెస్, సైబర్‌క్రైం తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. జూన్ 10వ తేదీ వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, కౌన్సిలర్ మెహతాజ్, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

●యాడికి: మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు కిశోరి వికాసంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మమ్మ, గ్రామ మహిళా పోలీసు లక్ష్మీ, అంగన్‌వాడీ సిబ్బంది జయమ్మ, పద్మావతి, వాణిలత, ఆశావర్కర్ ఎస్తేర్ రాణి, వీఓఏ రామాంజనేయులు పాల్గొన్నారు.

●బెళుగుప్ప: మండలకేంద్రంలోని సచివాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ విద్యార్థులకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ సాలిబాయి, సెక్రెటరీ శివరంజని, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

●యల్లనూరు: మండలకేంద్రంలో కోటవీధి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజామణి బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

●రాయదుర్గం: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో గల ఒకటి, రెండు, మూడు మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికలకు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సమావేశం నిర్వహించారు. ఇందులో కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, అనిత, సావిత్రి, కాంచన, ఆశ, పార్వతి, హెల్త్ సూపర్‌వైజర్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

●కణేకల్లు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి కిశోరివికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రం పరిశీలన

శెట్టూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరశాస్త్రి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి చెత్త , పొడి చెత్తగా వేరు చేసి ఎరువులు తయారు చేయాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి: వైసీపీ


గుత్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ శ్రేణులు


మాంచోఫెర్రర్‌కు సంఘీభావం తెలుపుతున్న వికలాంగుల సంఘం నాయకులు

గుత్తి, మే 2(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని పట్టణంలోని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యకర్తలతో కలిసి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టి పలువురు మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల అభ్యున్నతికి ఆర్డీటీ అనేక సేవలందిస్తోందని తెలిపారు. అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమన్నారు. కేంద్రం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేసి సంస్థ సేవలు కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత డిప్యూటీ తహసీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్‌వైస్‌చైర్మన్ వరలక్ష్మి, నాయకులు హుసేన్‌పీరా, గురుప్రసాద్‌యాదవ్, రంగస్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం..

కణేకల్లు: జిల్లాలో వికలాంగుల అభ్యున్నతికి ఎంతగానో పాటు పడిన ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్ కుమార్ పిలుపునిచ్చారు. వికలాంగుల సంఘం జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూఫెర్రర్‌ను కలిసి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వసంత్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో వికలాంగులతో పాటు పేదలు, మహిళల అభ్యున్నతికి ఆర్డీటీ అనేక సేవలందించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కోరారు. సంఘం నాయకులు ఉద్దీప్‌సింహ, డొణస్వామి, శశికళ, చెన్నమల్లప్ప, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాయదుర్గం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండన్న శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అందరూ ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. హాజరు కాని వారి పేర్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

రేపు కంటి వైద్య శిబిరం

బొమ్మనహాళ్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకుడు కురుబ లాలూస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ వన్నమ్మ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శాంతిరామ్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కళ్ల సమస్య ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలకు వచ్చే వారు ఆధార్, ఆరోగ్యశ్రీకార్డుల జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు.

గడ్డివామి దగ్ధం

రాయదుర్గం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో ఆదివారం రైతు ఈరన్నకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. 15 ఎకరాల్లో వరి పంటను కోసి కల్లెంలో వామి వేశామని, అయితే గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి సమయంలో నిప్పు పెట్టారని, దీంతో మొత్తం కాలిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ. 2 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామశివారులో శుక్రవారం ఎస్ఐ వెంకటనరసింహం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం రికార్డులులేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

యల్లనూరు, మే 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపై మండలంలోని ట్రాన్స్‌కో సిబ్బందికి గుత్తి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభం అవగాహన అందించారు. యల్లనూరు సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఆపరేటర్లతోపాటు, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎల్‌సీ ఇచ్చే సమయంలో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఏ చిన్నపొరపాటు జరిగినా నష్టం భారీగా ఉంటుందని తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- పలుగ్రామాల్లో నేలకూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

విడపనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. అంచనహాలు గ్రామం వద్ద గుంతకల్లు నుంచి విడపనకల్లుకు వచ్చే దారిలో 33బై11 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు సుమారు 8కిపైగా నేలకూలాయి. వీ కొత్తకోట గ్రామంలో 2, హావళిగి, కరకముక్కల, గడేకల్లు గ్రామాల్లో దాదాపుగా 30కిపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలుచోట్ల ట్రాన్స్ పార్మర్లు కూడా కూలిపోవటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. వాటి మరమ్మతులు చేసేందుకు విద్యుత్ అధికారులకు తీవ్ర కష్టాలు మొదలయ్యాయి. పొలాల్లో దాదాపుగా కిలోమీటరు దూరం విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్ పార్మర్లను తరలించేందుకు నానా కష్టాలు పడ్డారు. గ్రామాల్లో ఇళ్లు, చెట్లుపైన విద్యుత్ స్తంభాలు పడిన సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవటంతో ప్రాణనష్టం జరగలేదు.


గడేకల్లు వద్ద ధ్వంసమైన విద్యుత్ లైన్


హావళిగి వద్ద కూలిన ట్రాన్స్‌ఫార్మర్


వీ కొత్తకోటలో చెట్టుపై కూలిన విద్యుత్ స్తంభం


అంచనహాలు వద్ద పొలంలో..

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే గుమ్మనూరు

గుత్తిరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. కర్నూలు జిల్లా ఆలూరులో శుక్రవారం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసి ఆయన ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మస్తాన్ వలి, హుస్సేన్ చాంద్ బాషా, క్రిష్ణమూర్తి, రామకృష్ణ, వెంకటరాముడుతో పాటు మరో 20 కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామశివారులో గల రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన రత్నమ్మ, శశికళ, ఇందుశ్రీ కలిసి కారులో పత్తికొండకు వెళుతున్నారు. బసినేపల్లి గ్రామ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తూ కారు బోల్తా పడింది. దీంతో అందులోని ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

- మండల మీట్‌లో సభ్యుల ఆగ్రహం


విడపనకల్లులో అధికారులతో మాట్లాడుతున్న ఓ ఎంపీటీసీ సభ్యుడు

విడపనకల్లు, మే 2 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకంటూ మండల అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు మాట్లాడుతూ గతంలో జరిగిన సమావేశాల్లో మండలంలోని వివిధ సమస్యలను అధికారుల దృష్టికి సభ్యులు తీసుకొచ్చారని, అందులో ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు ఈ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. అనంతరం గడేకల్లు, కడదరబెంచి ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యంగా రెవెన్యూ అధికారులు ఒక్క సమస్యను కూడా పరిష్కరించడం లేదని వాపోయారు. ఇకనైనా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పాల్తూరు గ్రామంలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం గాలీ వానలతో విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.అలాగే పలు సమస్యలను వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఎంపీడీఓ షకీలాబేగం, విద్యుత్ ఏఈ సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజామిల్, ఏఓ పెన్నయ్య, వైద్యురాలు పుష్ప, ఈఓ ఆర్డీ సత్యేసుబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి పలు సమస్యలు..

ఉరవకొండ: వజ్రకరూరు మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీపీ దేవిబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో సభ్యులు పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. అలాగే బోరు బావుల కింద సాగు చేసిన పంటలకు విద్యుత్ సక్రమంగా లేక ఎండిపోతున్నాయని, కనుక సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. ఉపాధి పనులను కల్పించి వలసలను నివారించాలని కొనకొండ్ల ఎంపీటీసీ సభ్యుడు మునయ్య విన్నవించారు. వెంకటాంపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కమలమ్మ కోరారు. మండల సమావేశానికి హాజరు కాని విద్యుత్ శాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ రవిప్రసాద్, తహసీల్దార్ నరేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంజికుంటలో మహా పట్టాభిషేకం

ఉరవకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామంలో నీలగిరిస్వామి, అయ్యాలప్ప స్వామి మహా పట్టాభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉదయమే స్వామి వార్లకు గంగపూజ, పటం పూజ చేశారు. అనంతరం స్వాములను ఊరేగించారు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

వక్ఫ్‌భూములను కాపాడాలని వినతి

గుంతకల్లుటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): గుత్తి మున్సిపాలిటీలోని సర్వే నెంబర్ 626లో ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను కాపాడాలని టిప్పుసుల్తాన్ ఇత్తహదుల్ ముస్లిమీన్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గుంతకల్లుకు వచ్చి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుత్తిపట్టణంలో నడిబొడ్డున ఉన్న రూ. కోటి విలువైన వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, అక్కడి మున్సిపాలిటీ, వక్ఫ్ బోర్డు అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. మీరైనా స్పందించి వక్ఫ్‌భూములను కాపాడాని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కమిటీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

రాయదుర్గం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురానికి చెందిన ఓ మట్కాబీటర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. గ్రామంలో మట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో దాడులు నిర్వహించి అరెస్టు చేశామన్నారు. అలాగే అతడి వద్ద నుంచి రూ. 30 వేల నగదును, మట్కా చీటీలు, ఒక బాల్‌పెన్నును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


గొడుగుల పంపిణీ

యాడికి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రోడ్డుపక్కల పండ్ల వ్యాపారాలు నిర్వహించుకునే 22మంది మహిళలకు స్థానిక రైల్వే ఇంజనీర్ శశిధర్ శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్లవ్యాపారులు ఎండలో తీవ్రఇబ్బందులు పడుతున్నారని, దీంతో తన వంతు సాయంగా గొడుగులు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

తాడిపత్రి క్రికెట్ టోర్నీ విజేత ఆర్డీటీ జట్టు

తాడిపత్రి, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 15రోజులుగా జరుగుతున్న తాడిపత్రి క్రికెట్ టోర్నమెంట్‌లో తాడిపత్రి ఆర్డీటీ జట్టు విజేతగా నిలిచిందని ఆర్డీటీ కోచ్ భార్గవ్ తెలిపారు. శుక్రవారం తాడిపత్రి ఆర్డీటీ జట్టు, ఏడీసీఏ గుంతకల్లు జట్టు మధ్య ఫైనల్‌మ్యాచ్ జరిగింది. ఇందులో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి ఆర్డీటీ జట్టు 20ఓవర్లలో 181పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు 166పరుగులు సాధించి ఓటమిపాలైంది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరై విజేత జట్టుకు రూ.50వేల నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. రన్నరప్ జట్టుకు రూ.30వేల నగదు బహుమతి, ట్రోఫీని అందించారు. టోర్నమెంట్‌లో తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాధిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి జేసీపీఆర్ పరామర్శ


టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న జేసీపీఆర్

పెద్దవడుగూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఇంటి లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదంపై ఆరా తీశారు. అన్నివిధాలా ఆదుకుంటామని, ఏ సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.